# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-11-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. ఢిల్లీలో పర్యటిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, డాక్టర్ ఎస్. జైశంకర్‌తో సమావేశమయ్యారు.
2. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో సంస్థల ఏర్పాటుకు అవసరమైన మేరకే భూములు కేటాయించాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది.
3. తెలంగాణ వ్యాప్తంగా కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.
4. తెలంగాణలో సంక్రాంతి నుంచి రేషన్ కార్డుదారులందరికీ సన్నబియ్యం అందజేస్తారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.
5. శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తుల కోసం దక్షిణ మధ్య రైల్వే 8 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది.

==========================

ఢిల్లీలో పర్యటిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిన్న కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్‌తో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటన వివరాలను నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు పాత్రికేయులకు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టనున్న గోదావరి–కృష్ణా–పెన్నా నదుల అనుసంధానానికి కేంద్రం ఆర్థికసాయం చేయాలని కేంద్ర ఆర్థికమంత్రిని ముఖ్యమంత్రి కోరారని చెప్పారు. దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపే విదేశీ పారిశ్రామికవేత్తలను ఆంధ్రప్రదేశ్‌కి పంపాలని విదేశాంగ మంత్రిని కోరారని తెలిపారు.

ఇది ఇలా ఉండగా ముఖ్యమంత్రి ఈ ఉదయం ఒక ఆంగ్ల పత్రిక నిర్వహించే నాయకత్వ సదస్సులో పాల్గొన్న అనంతరం ముంబయికి వెళ్లి మహారాష్ట్ర ఎన్నికల్లో ఎన్డీయే కూటమి తరపున ప్రచారం చేయనున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో సంస్థల ఏర్పాటుకు అవసరమైన మేరకే భూములు కేటాయించాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించిందని రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. రాష్ట్ర

సచివాలయంలో రాజధాని అమరావతి నిర్మాణంపై మంత్రివర్గ ఉపసంఘం నిన్న సమావేశమైంది. అనంతరం మంత్రి నారాయణ పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ ( 25 సెకన్లు )

ప్రతి పది రోజులకు రాజధాని అమరావతి నిర్మాణంపై మంత్రివర్గ ఉపసంఘం సమావేశమవుతుందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలుపుతూ,

వాయిస్ (34 సెకన్లు )

---------------------------

తెలంగాణ వ్యాప్తంగా కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను దేశానికి ఆదర్శమయ్యేలా ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సర్వే జరుగుతున్న తీరుపై హైదరాబాద్ లోని క్యాంపు కార్యాలయంలో నిన్న అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "నవంబరు 6వ తేదీన ప్రారంభమైన సర్వేను నిర్దేశించిన కాలపరిమితిలో పూర్తి చేయడానికి అధికారులు కృషి చేయాలని అన్నారు. సర్వే జరుగుతున్న తీరును రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రశాంతంగా జరిగేలా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

బాలబాలికల ప్రతిభను తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహిస్తే వారు అనుకున్న లక్ష్యాలను చేరుకుంటారని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు జిల్లా నంబూరులోని వీవీఐటీ కళాశాలలో మూడు రోజులపాటు జరగనున్న ప్రపంచ తెలుగు బాలల పండగ వీవీఐటీ బాలోత్సవ్-2024 వేడుకలను కేంద్రమంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్ (30 సెకన్లు)

---------------------------

తెలంగాణలో సంక్రాంతి నుంచి రేషన్ కార్డుదారులందరికీ సన్నబియ్యం అందజేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో నిన్న మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో 27 జిల్లాల్లోని 7411 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయని, ధాన్యాన్ని పారదర్శకంగా కొనుగోలు చేస్తున్నామని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వారం రోజుల్లో నగదు బ్యాంకు ఖాతాల్లోకి జమ చేస్తున్నామని చెప్పారు. మంత్రి వర్గ ఉపసంఘం నివేదిక ఆధారంగా రైతు భరోసా ఇస్తామని మంత్రి వివరించారు.

---------------------------

శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులకు కోసం ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వేర్వేరు ప్రాంతాలను కలుపుతూ 8 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. ఈ నెల 22, 29 తేదీల్లో మౌలాలి-కొల్లాం, ఈనెల 24, డిసెంబర్ 1వ తేదీల్లో కొల్లాం-మౌలాలి, నవంబర్ 18, 25 తేదీల్లో మచిలీపట్నం-కొల్లాం, నవంబర్ 20, 27 తేదీల్లో కొల్లాం- మచిలీపట్నం

ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే పేర్కొంది. అయ్యప్ప భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరింది.

-------------------------

బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష కార్యక్రమం ద్వారా ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ కోసం ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. విజయవాడలోని పటమట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష కార్యక్రమాన్ని మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా చిన్నారుల నుండి 18 సంవత్సరాల వయస్సు కలిగిన వారిలో 44 ఆరోగ్య సమస్యలకు పరీక్షలు నిర్వహించి ఉచిత చికిత్సను అందించడం జరుగుతుందని మంత్రి తెలుపుతూ ,

వాయిస్ (33 సెకన్లు)

-------------------------

ఆంధ్రప్రదేశ్ శాసన సభ నిన్న పలు ప్రధాన బిల్లులను ఆమోదించింది. సభ ఆమోదించిన బిల్లులలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రవేశ పెట్టిన "ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ సుంకం సవరణ బిల్లు - 2024", ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన "ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసు క్రమబద్ధీకరణ సవరణ బిల్లు - 2024" ఉన్నాయి. అలాగే పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన " ఆంధ్రప్రదేశ్ ద్రవ్య వినిమయ బడ్జెట్ బిల్లు - 2024" ను కూడా శాసన సభ ఆమోదించింది.

-------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూపొందించిన నూతన మద్యం, ఇసుక విధానాలు సక్రమంగా అమలు జరిగేలా శాసన సభ్యులు బాధ్యత వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన 2024- 25 వార్షిక బడ్జెట్‌పై జరిగిన చర్చకు నిన్న ఆయన సమాధానమిస్తూ, నిరుద్యోగ సమస్య పరిష్కార దిశగా 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. వంశధార, గోదావరి, పెన్నా నదులను అనుసంధానించడం ద్వారా రాష్ట్రంలో కరవు లేకుండా చూస్తామని తెలిపారు. పరిశ్రమలు, పెట్టుబడులు ఆకర్షించేందుకు ఆరు నూతన విధానాలు తీసుకు వచ్చామని ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని ముఖ్యమంత్రి పిలుపు నిచ్చారు.

-------------------------

ఈరోజు జాతీయ పత్రికా దినోత్సవం జరుపుకుంటున్నాం. 1956లో భారత తొలి ప్రెస్ కమిషన్ సిఫార్స్ మేరకు 1966 నవంబర్ 16వ తేదీన ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఏర్పాటు చేయడం జరిగింది. అప్పటి నుంచి ప్రతి ఏడాది నవంబర్ 16వ తేదిన జాతీయ పత్రికా దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నాం. ప్రెస్ కౌన్సిల్ పత్రికా రంగానికి ఎదురయ్యే సవాళ్లు, సమస్యల గురించి ప్రతి ఏడాది నవంబరు 16న సదస్సులు నిర్వహిస్తారు.

======================